క్లుప్తంగా

సంఘాన్ని బలోపేతం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో ఎమ్మార్పీఎస్ టీఎస్ సంఘాన్ని బలోపేతం చేసుకుని వర్గీకరణ ఉద్యమంలో చురుగ్గా ఉండాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పడిదల రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ పార్క్‌లో నిర్వహించిన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 1 నుంచి 7వతేదీ వరకు పూర్తి స్థాయిలో మండల, గ్రామ శాఖలను నిర్మాణం చేసుకోవాలన్నారు. 7వ తేదీన సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పర్యవేక్షకుడు చింత బాబుమాదిగ, ఇన్‌చార్జ్ మరికంటి అంబేద్కర్, నాయకులు పల్లేటి లక్ష్మణ్, బచ్చలకూరి నాగరాజు, పాల్వాయి సూరయ్య, వెంకట్, నారాయణ, పెంటయ్య, జానయ్య పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సన్మానిస్తున్న వైద్యసిబ్బంది

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఉద్యోగం చేసిన ప్రతి చోట బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఉద్యోగులకు బదిలీలు సహజమని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వెంకట రమణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న గురుస్వామి, సంధ్యారాణి, పూలమ్మ పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారిని ఆయన శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి మల్లెల వందన, సీహెచ్ఓ బిచ్చునాయక్, వైద్యసిబ్బంది ఉన్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



బాబా సమాది వద్ద ప్రార్థన చేస్తున్న శ్రీకాంత్‌రాజ్, కమిటీ సభ్యులు

అర్వపల్లి : మండల కేంద్రంలోని దర్గాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు తాడోజు వాణిశ్రీకాంత్‌రాజ్ అన్నారు. శుక్రవారం అర్వపల్లి శివారులోని ఖాజానసీరుద్దీన్ బాబాను సందర్శించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన అర్వపల్లి దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ బైరబోయిన సైదులు, సభ్యులు వీరపాపయ్య, సైదులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. పలువురు కూలీలకు గాయాలు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్

సూర్యాపేట రూరల్ : ఉపాధిహామీ కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడి పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం సూర్యాపేట మండల పరిధిలోని సోలిపేట గ్రామపరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోలిపేట గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీలు పనిచేయడానికి ఓ ట్రాక్టర్‌ను ఎక్కి పని ప్రదేశానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో అందులో ఉన్న కూలీలకు స్వల్పగాయాలయ్యాయి. వారిని వెంటనే స్థానికులు సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్, ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

బీరువా బహూకరణ

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి జెడ్పీ పాఠశాలకు 2021–22 పదోతరగతి పూర్వవిద్యార్థులు శుక్రవారం బీరువాను బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దారం నాగరాజు, శ్రీనివాసులు, ఎల్.సుగుణ, బి.రామచంద్రయ్య, ఎస్.అవివేలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ

తుంగతుర్తి : ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నోట్‌పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బోయిని లింగయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెలుగుపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన నోట్ పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నారావు, ఎలిజబెత్, అర్జున్, సునీత పాల్గొన్నారు.

అర్ధాకలితో పాఠశాల విద్యార్థులు

- వెలిశాల పాఠశాలలో వారం రోజులుగా మధ్యాహ్న భోజనం బంద్
- బిల్లులు రాక వండటానికి ముందుకు రాని ఏజెన్సీలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



వెలిశాల పాఠశాలలో ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం పాఠశాలల్లో అమలుకాక నీరుగారుతుంది. దీంతో విద్యార్థులు అర్ధాకలిలో అలమటిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై నెలరోజులవుతున్నా పాఠశాలల్లో విద్యార్థులకు సరిగా మధ్యాహ్న భోజనం అందడంలేదు. ఈ పరిస్థితి తిరుమలగిరి మండలంలోని వెలిశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారం రోజులుగా ఏర్పడింది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండటానికి ఏజెన్సీలు ముందుకు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ప్రారంభంలో ఏజెన్సీ నిర్వాహకులు వచ్చి వారం రోజుల పాటు మధ్యాహ్న భోజనం వండివెళ్లారు. మరో వారం రోజులు పాఠశాల సిబ్బందే విద్యార్థులకు వండి పెట్టారు. గత వారంరోజులుగా వంట వండకపోవడంతో పలువురు విద్యార్థులు పస్తులుంటూ.. మరికొంత మంది ఇంటి దగ్గరి నుంచి బాక్సులో తెచ్చుకుంటున్నారు. వెలిశాల ఉన్నత పాఠశాలలో 94మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు రూ.8.17పైసలు, 9 నుంచి 10విద్యార్థులకు రూ.10.65పైసలు, కోడి గుడ్లకు రూ.5 అందిస్తారు. అదే విధంగా వంట చేసే నిర్వాహకులకు నెలకు రూ.వెయ్యి వేతనాన్ని చెల్లిసున్నారు.

సరిగా అందని బిల్లులు..

వంట చేసే నిర్వాహకులకు ప్రభుత్వం రూ.1000 నుంచి రూ.2000 వేతనం ఇస్తామని చెప్పినా ఇంత వరకు పెంచలేదు. అలాగే 9, 10వ తరగతి విద్యార్థుల బిల్లులు సెప్టెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే 1నుంచి 8 తరగతులు చదివే కోడిగుడ్ల బిల్లులు సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు రాలేదు. నిర్వాహకులకు ప్రతి నెలా చెల్లించే వేతనాలు కూడా ఆలస్యంగా అవుతుండడంతో వంట చేయడానికి నిర్వాహకులు ముందుకు రావడం లేదు.

పెరిగిన ధరలతో ఇబ్బందులు..

మధ్యాహ్నం వంటకు కావాల్సిన నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు భారీగా పెరగడం, మధ్యాహ్న భోజనం బిల్లులు కూడా నెలనెలా సక్రమంగా రాకపోవడంతో వంట చేయడానికి గ్రామంలో నిర్వాహకులు ఎవరూ ముందుకు రావడం లేదు. వంట చేస్తే తమకు కనీసం గిట్టుబాటు కావడం లేదని ఏజెన్సీల నిర్వాహకులు వాపోతున్నారు. దీంతో పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్ అయింది. వెలిశాల పాఠశాలకు చుట్టు పక్కల ఉన్న బండ్లపల్లి, ఇతర తండాల నుంచి విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పాఠశాలకు వస్తున్నారు. కొంత మంది విద్యార్థులు ఉదయమే కొద్దిగా తిని బాక్సుల్లో తెచ్చుకుంటున్నారు. మరి కొందరు ఖాళీగానే ఉంటున్నారు. దీంతో అర్ధాకలితో విద్యార్థులు పాఠాలు సరిగా వినలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంట నిర్వాహకులను ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనం ఏర్పాటు అయ్యే విధంగా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం అందించాలి



పాఠశాలకు ప్రతిరోజూ చింతలకుంటతండా నుంచి 4కి.మీ నడిచి ఉదయం 8.30 గంటలకే వస్తాను. మధ్యాహ్నం భోజనం పాఠశాలలో వడ్డించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రతిరోజూ అందిస్తే బాగుండు. ఇంటి నుంచే అన్నం బాక్స్‌లో పెట్టుకుని వస్తున్నాను.

– తిరుపతి, చింతలకుంటతండా, విద్యార్థి

కొద్ది రోజులుగా భోజనం వండడం లేదు



వెలిశాల పాఠశాలకు బండ్లపల్లి గ్రామం నుంచి ప్రతిరోజు వస్తు న్నాను. గత కొద్ది రోజుల నుంచి పాఠశాలలో మధ్యాహ్న భోజనం లేకపోవడంతో ఇంటి వద్ద నుంచే బాక్సులో అన్నం పెట్టుకొని వస్తున్నాము. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేలా చూడాలి.

– మధుశ్రీ, బండ్లపల్లి, విద్యార్థిని

ఏజెన్సీలు ముందుకు రావడం లేదు

పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండటానికి ఏజెన్సీ నిర్వాహకులు ఎవరూ ముందుకు రావడం లేదు. వంట చేయించడానికి స్థానిక సర్పంచ్‌తో కూడా మాట్లాడాము. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది.

– శ్రావణ్‌కుమార్, హెచ్ఎం, వెలిశాల

తాగునీటి సరఫరాలో ప్రభుత్వం విఫలం

- కాంగ్రెస్ కౌన్సిలర్ల విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ బైరు శైలేందేర్‌గౌడ్, ఆ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణ అవసరాలకు కావాల్సిన నీటిలో సగమే సరఫరా అవుతుండడంతో జనం మంచినీటికి అల్లాడిపోతున్నారని తెలిపారు. నిత్యం మంచినీటిని అందిస్తున్నామని చెప్పుకుంటున్న ప్రచారం ఉత్తదేనన్నారు. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు సూర్యాపేటకు మంచినీటి సరఫరా కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పాలకవర్గం దృష్టికి తీసుకొచ్చినా స్పందించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో నిర్మించిన దోసపహాడ్ ఫిల్టర్ బెడ్ ద్వారా మంచినీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ వేములకొండ పద్మ, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నెల్లుట్ల లింగస్వామి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలగాని బాలుగౌడ్ ఉన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

తుంగతుర్తి : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల విశ్రాంతి భవనంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు నివేదికను అందిస్తామన్నారు. పెన్షనర్లకు ప్రతినెలా 1వ తేదీనే పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పీఆర్సీని తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు సీతరామయ్య, చంద్రశేఖర్‌రావు, రవీందర్‌రెడ్డి, యాదగిరి, సత్యనారాయణ, సంతోష్, సంపత్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబీకురాలైన బతుకమ్మ అనే వృద్ధురాలు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబాన్ని ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణి శ్రీకాంత్‌రాజ్ పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ బైరబోయిన సైదులు, ఈదురు వీరపాపయ్య తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలతో గ్రామాలు అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం

పెన్‌పహాడ్ : తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సహకారంతో గ్రామాలన్ని అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. అనంతరం వైస్‌ఎంపీపీ గార్లపాటి సింగారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని ఎస్సీకాలనీలో సీసీరోడ్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని, అదే విధంగా లింగాల క్రాస్‌రోడ్డు నుంచి లింగాల వరకు బీటీ రోడ్డు గుంతలమయంగా ఉందని బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని చీదెళ్ల జెడ్పీ పాఠశాలకు మంచినీరు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. సర్పంచ్ దొంగరి సుధాకర్ మాట్లాడుతూ.. దోసపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని ఆయన కోరారు. సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రస్తావించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గార్లపాటి సింగారెడ్డి, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, తహసీల్దార్ శేషగిరిరావు, పీఏసీఎస్ చైర్మన్‌లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, ఎంపీఓ నరేష్ పాల్గొన్నారు.

దళితులు హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



పెన్‌పహాడ్ : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐ మట్టయ్య

సూర్యాపేట రూరల్ : దళితులు డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని హక్కులను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కాసరబాద గ్రామంలో పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొని వారు మాట్లాడారు. దళితుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారిని ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. దళిత బంధు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ కొల్లు రేణుకయాదవ్, ఎంపీటీసీ బంటు నాగమ్మసైదులు, ఏపీఎం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

పెన్‌పహాడ్ : భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కులకు భంగం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఆర్ఐ మట్టయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెట్లముకుందాపురం గ్రామంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో కుల మతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ కలిసిమెలసి జీవించాలన్నారు. మత సంప్రదాయాలను కాపాడుతూ శాంతియుత వాతావరణంలో మెలగాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారిని ఏఒక్కరూ కించపర్చినా చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. దేవాలయాల ప్రవేశానికి అన్ని కులాల వారు అర్హులేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటి చట్టాలతో పాటు ప్రతి అంశంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న బెల్లంకొండ ప్రియాంక ప్రేమ్

సూర్యాపేటటౌన్ : కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని గైనకాలజిస్టు డాక్టర్ బెల్లంకొండ ప్రియాంక ప్రేమ్ అన్నారు. యూత్ ఫర్ సేవ, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆరోగ్యం, రుతుక్రమ పరిశుభ్రత అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిశోర బాలికలు తమ రుతుక్రమ సమస్యలను, సందేహాలను నిర్భయంగా, సంకోచించకుండా ఇంట్లో తల్లులతో, పాఠశాలలోని ఉపాధ్యాయినులతో చర్చించి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ వయసులో ఐరన్ ఉన్న ఆహార పదార్థాలను అధికంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంధ్యారాణి, యామా రమేష్, పాఠశాల హెచ్ఎం నాగరాణి, ఉపాధ్యాయులు దీపాదేవి, పద్మశ్రీ, ఇందిర, సత్యవతి, జ్యోతి, ఝాన్సీరాణి, ప్రమీల, ఇందిరమ్మ, తబిత పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం



నాగారంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

నాగారం : బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తుంగతుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. తిరుమలగిరిలో జరిగిన ప్రగతి నివేదన సభలో మంత్రి కేటీఆర్ ఉత్తర ప్రగల్భాలు పలికి పోయారని, తుంగతుర్తిలో జరిగిన అభివృద్ధి గురించి మాట్లాడలేదని విమర్శించారు. తిరుమలగిరి, మోత్కూర్ మున్సిపాలిటీల్లో కనీసం డ్రెయినేజీ వ్యవస్థ లేదన్నారు. నియోజకవర్గంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పి ఇచ్చిన హామీని గాలికొదిలారని అన్నారు. ఆయన వెంట బీజేపీ మండల విస్తారక్ బ్రహ్మదేవర రత్నాకుమారి, జిల్లా ఉపాధ్యక్షురాలు పేరాల పూలమ్మ, కడారి సుజాత, గిరిప్రసాద్, మంగదుడ్ల రమేష్, కిరణ్, వెంకన్న, కొమిరెల్లి, భార్గవ్ ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

బీజేపీ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల విస్తారక్ బ్రహ్మదేవర రత్నాకుమారి, జిల్లా ఉపాధ్యక్షురాలు పేరాల పూలమ్మ, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కడారి సుజాత, గిరిప్రసాద్, మంగదుడ్ల రమేష్, కిరణ్, నాగు వెంకన్న, కొమిరెల్లి, భార్గవ్, సురేష్, అంజయ్య, మహేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలి

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య రాంజీ మాట్లాడుతూ.. ప్రజల దాహార్తిని తీర్చేందుకు కోట్లాది రూపాయాలు ఖర్చు చేసిన మిషన్ భగీరథ కాస్త అధికార పార్టీ నాయకులకు కమీషన్ల భగీరథ అయిందన్నారు. వారం రోజులుగా పట్టణంలో తాగునీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మిషన్ భగీరథ పైపులు నాణ్యత లేకపోవడంతో వారానికి రెండు, మూడు సార్లు పైపులు పగలడం, లీకేజీలు అవుతున్నాయని అన్నారు. పట్టణంలో డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడం, పూడిక తీసినా దానిని ఎత్తకపోకపోవడంతో దుర్వాసన, దోమలతో అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. లేకుంటే పట్టణ ప్రజలతో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీవన్, వీరబాబు, వాజీద్, నగేష్ పాల్గొన్నారు.

గోదావరి జలాలు తెచ్చిన ఘనత కాంగ్రెస్‌దే



సమావేశంలో మాట్లాడుతున్న నర్సయ్య

తిరుమలగిరి (తుంగతుర్తి) : తుంగతుర్తి నియోజకవర్గాన్ని మొదటగా గోదావరి జలాలు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని టీపీసీసీ సభ్యుడు గుడిపాటి నర్సయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి జలాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు తాము తీసుకొచ్చామని చెప్పడం ఎంత వరకు సమంజసమని అన్నారు. గోదావరి జలాల కోసం రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. గురువారం జరిగిన ప్రగతి నివేదన సభ కాదని, ప్రగతి నిరోధకుల సభ అని విమర్శించారు. గత సంవత్సరం మంజూరైన మున్సిపాలిటీ భవనానికి ఇప్పుడు శంకుస్థాపన చేయడం ఏంటని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, పేరాల వీరేష్, జమ్మిలాల్, ప్రేమ్‌ప్రసాద్, రామోజి, అబ్బాస్, ఉపేందర్, రాకేష్, యశ్వంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనతో ఒరిగింది ఏమీలేదు

తుంగతుర్తి : నియోజకవర్గంలో ఇద్దరు మంత్రులు పర్యటనతో నియోజకవర్గ ప్రజలకు ఒరిగిందేమీలేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చేయని పనులను తామే చేసినట్లు అబద్ధపు ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టారని అన్నారు. నియోజకవర్గానికి రూ.6వేల కోట్లతో ఏమి అభివృద్ధి చేశారో బీఆర్ఎస్ నాయకులకు శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఆయన వెంట గాజుల మహేందర్, నరేష్, సునీత, నాగరాజు, లక్ష్మణ్, మధు, శ్రీకాంత్, నవీన్, శ్రీహరి, సైదులు, ప్రకాశ్ ఉన్నారు.

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

తుంగతుర్తి : తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజలకు అబద్ధాలు చెబుతూ పబ్బం గడుపుతున్న బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 9ఏళ్లల్లో నియోజకవర్గానికి రూ.6500 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వెంట గొడ్డలి నర్సయ్య, రామన్న, వీరయ్య, ఎల్లయ్య, ఎల్లమ్మ, అంజయ్య, శ్రీకాంత్, రాజు ఉన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పెంటయ్యకు సన్మానం

అర్వపల్లి : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తూ శుక్రవారం పదవీ విరమణ పొందిన స్వీపర్ పెంటయ్యను కార్యాలయంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్.నర్సింహరాజు, ఏపీఓ సీహెచ్.ఉపేందర్, ఈసీ నగేష్, టీఏలు యాదమ్మ, దీపిక, నాగమణి, సీఓలు సంతోష, రేణుక, నవీన్, సిబ్బంది ఉప్పలమ్మ, మంజుల, పుష్ప తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగారం : వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో ప్రభుత్వం రైతులకు ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందించి, బ్యాంకు రుణాలు ఇవ్వాలని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, డివిజన్ కార్యదర్శి సంపెట కాశయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా నేటికి రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచలేదన్నారు. వడగండ్లతో పంట నష్టపోయిన రైతులకు తక్షణమే రూ.15వేలు పరిహారం అందించాలని కోరారు. పీఏసీఎస్ ద్వారా ప్రభుత్వం రైతులకు 30శాతం సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలన్నారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చి, కౌలు రైతులకు, పోడు సాగుదారులకు ఇన్‌పుట్ సబ్సిడీలు, పంట నష్టపరిహారం, పంట రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు లింగయ్య, జాజుల సామేలు, ధనుంజయ్, ఉప్పలయ్య, సతీష్, విక్రమ్, కళింగరెడ్డి, సోమన్న, శ్రీను పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

పెన్‌పహాడ్ : మండలంలోని లింగాలలో యాదవ కులస్తులకు కేటాయించిన శ్మశానవాటికలో అక్రమంగా చెట్లు నరికిన కానిస్టేబుల్ దాచేపల్లి అరవింద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ యాదవ సంఘం సభ్యులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ శేషగిరిరావు, ఇన్‌చార్జ్ ఎస్ఐ మధునాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన అరవింద్ శ్మశానవాటికలో పెరిగిన చెట్లను అక్రమంగా నరికి వేశారని అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ శేషగిరిరావు మాట్లాడుతూ.. విచారణ చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రామస్వామి, సైదయ్య, శ్రీరాములు, లింగయ్య, మల్లయ్య, వెంకన్న, సైదులు, రవీంద్ర, లింగయ్య ఉన్నారు.

మోడల్‌స్కూల్, గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి

నూతనకల్ : మండల కేంద్రంలో మోడల్‌స్కూల్, గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారని, మండల కేంద్రంలో గురుకుల, మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఏసు, రాము, కృష్ణారెడ్డి, నవీన్, మనోహర్, సుమంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.